క్లుప్తంగా

జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో జొన్న కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె మాట్లాడుతూ.. జొన్న పంట అమ్మకం విషయంలో రైతులు ఆందోళన చెందావద్దన్నారు. ప్రతిగింజనూ కొనుగోలు చేస్తామన్నారు. పీఏసీఎస్ సీఈవోలు ధర్‌సింగ్, సునీల్, రైతులు పాల్గొన్నారు.

పాల శీతలీకరణ కేంద్రాన్ని తిరిగి ప్రారంభిస్తాం



పాల శీతలీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న విజయ డెయిరీ అధికారులు

బోథ్: మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులో పాల శీతల కేంద్రాన్ని తిరిగి ప్రారంభిస్తామని విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ మధుసూధన్ రావు తెలిపారు. గురువారం మూతబడిన పాలశీతలీకరణ కేంద్రాన్ని పరిశీలించారు. తిరిగి ప్రారంభిస్తే రైతులకు ఉపయోగపడుతుందన్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ క్షేత్రస్థాయి అధికారి గంగన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మణ్‌సింగ్, వైస్ ఎంపీపీ లింబాజీ ఉన్నారు.

శ్రీహరిరావును కలిసి కాంగ్రెస్ నాయకులు

ఉట్నూర్‌రూరల్: నిర్మల్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుడు కుచాడి శ్రీహరిరావు ఇటీవల కాంగ్రెస్ చేరిన సందర్భంగా నిర్మల్ జిల్లాలో వారి నివాసంలో కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ స్థితిగతులపై చర్చించారు. ఇందులో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ భొజ్జుపటేల్, మండల అధ్యక్షుడు దయానంద్, సత్యం, మాజీద్, మల్లేశ్, జహీర్, రమేశ్, నర్సయ్య, రాజు, పరమేశ్వర్, సలీంఖాన్ పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలను సంరక్షించాలని జనశిక్షణ్ సంస్థాన్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజన్న తెలిపారు. జీ20 కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని అటెండర్స్ కాలనీలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా రెండు మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో జన శిక్షణ్ సంస్థాన్ సిబ్బంది సంతోశ్, రాజు, ఉపాధ్యాయురాలు చైతన్య పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థి రాథోడ్ సాకేత్ నాయక్ నీట్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంక్ సాధించడంతో విద్యార్థిని మేనేజ్‌మెంట్ కమిటీ గురువారం అభినందించింది. ఈసందర్భంగా ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు మాట్లాడుతూ.. ఉన్నత ఆశయంతో చదివి గిరిజనులకు సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ప్రభాకర్, పాదిల సుదర్శన్, మేకల రాజేశ్వర్, ప్రిన్సిపాల్ ప్రకాశ్ పాల్గొన్నారు.

'సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి'

ఖానాపూర్: బాసర ట్రిపుల్ ఐటీలో వరుసగా జరుగుతున్న ఆత్మహత్యలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బి.గోవింద్‌నాయక్ డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారులపై చర్యలు తీసుకుని ఆత్మహత్యలు పునరావృతం కాకుండా దృష్టి సారించాలన్నారు.

'పోడు'పట్టాలు ఇవ్వాలి

ఖానాపూర్: పోడుభూములు సాగు చేసుకుంటూ దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తొడసం శంభు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనంలో జిల్లా అధ్యక్షులు ఆత్రం బలవంత్‌రావు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి ఆయన హాజరై మాట్లాడారు.

ప్రభుత్వ బడులకు చేయూత

- విరాళాలు అందజేస్తున్న దాతలు
- మెరుగవుతున్న వసతులు
- పాఠశాలల అభివృద్ధికి సహకారం



టేబుల్స్ అందజేస్తున్న కుచులపూర్ గ్రామస్తులు



నోట్‌పుస్తకాలు అందజేస్తున్న కాడే స్వామి

తలమడుగు: కార్పొరేట్ పాఠశాలలు రావడంతో ప్రస్తుతం సర్కారు బడులపై అధికారులు, ప్రజలు చిన్నచూపు చూస్తున్నారు. ప్రవేట్‌బడుల్లో టెక్నోలు, ప్లేస్కూల్ అంటూ ఊదరగొడుతూ.. విద్యార్థుల తల్లిదండ్రులను తమ వైపు తిప్పుకొనేందుకు ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ బడులంటేనే పేద విద్యార్థుల నిలయాలు అన్నట్లుగా చిత్రీకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ బడులంటే నమ్మకం కలిగించేందుకు ఉపాధ్యాయులు, దాతలు ముందుకు వస్తున్నారు.

- కజ్జర్ల, తలమడుగు, రుయ్యాడి, కుచులపూర్, సకినాపూర్ పాఠశాలలకు గ్రామస్తులు, దాతలు తమ వంతుగా చేయూతనందించారు.
- తలమడుగు మండల కేంద్రంలోని జెడ్పీ, ప్రాథమిక పాఠశాలతో పాటు సకినాపూర్, అర్లి, కోసాయి, లింగి, ఖోడద్ పాఠశాల విద్యార్థులకు మహారాష్ట్ర బ్యాంక్ స్పెషల్ అసిస్టెంట్ కాడే స్వామి విద్యార్థులకు తన వంతుగా రూ. 50 వేలు విలువ చేసే నోట్ బుక్‌లు, పెన్నులు అందిస్తున్నాడు.
- కజ్జర్ల పాఠశాల అభివృద్ధికి వీడీసీ, గ్రామస్తుల సహకారంతో ప్రాథమిక పాఠశాలకు రూ. 50 వేలు, జెడ్పీ పాఠశాలకు రూ. 50 వేల చొప్పున అందజేశారు.
- తలమడుగు జెడ్పీ పాఠశాలలకు ప్రొజెక్టర్‌ను గ్రామవాసీ పద్మకర్‌రెడ్డి అందజేశారు. కిష్టారెడ్డి ప్రతీ ఏడాది ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ. 5 వేల నుంచి రూ. 20 వేల వరకు ఉపకార వేతనాలు అందిస్తున్నాడు.
- జెడ్పీ పాఠశాల విద్యార్థులకు స్టేజీ లేక పోవడంతో వైకుంఠట్రస్టు చైర్మన్ రవి కిరణ్‌యాదవ్ ఆర్థిక సాయం అందజేశాడు.

పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు..

సర్కార్ బడులను కాపాడుకునేందుకు ఉపాధ్యాయులు వివిధ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. దాతలు ఆర్థిక సాయం చేయాలని కోరాగా.. పలువురు స్పందించారు. వీడీసీ, గ్రామస్తుల సహకారంలో పలు పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించారు. కజ్జర్ల ప్రాథమిక పాఠశాలలో కుర్చీలు, బల్లాలు, టార్పలిన్‌లు అందజేశారు. ప్రవేట్ పాఠశాలలకు దీటుగా ఉపాధ్యాయులు బోధన అందిస్తున్నారు.

దాతలు ముందుకు రావాలి



ప్రభుత్వ బడుల్లో సౌకర్యాల కల్పనకు దాతలు ముందుకు రావాలి. పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు వస్తే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది. ప్రభుత్వ బడులు బలోపేతమవుతాయి. నావంతుగా ప్రతీ ఏటా విద్యార్థులకు లక్ష రుపాయలు విలువ చేసే పుస్తకాలు అందిస్తున్నాను.

– కాడే స్వామి, మహారాష్ట్ర బ్యాంక్ స్పెషల్ అసిస్టెంట్

బీటీరోడ్డుకు మోక్షమెప్పుడో?



లింగాపూర్‌కు వెళ్లే మట్టిరోడ్డు

- లింగాపూర్ ప్రజలకు తప్పని తిప్పలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

గుడిహత్నూర్: మండలంలోని లింగాపూర్ గ్రామంలో సుమారు 200 కుటుంబాలు నివసిస్తున్నాయి. 2011 లెక్కల ప్రకారం 642 జనాభా ఉండగా.. ప్రస్తుతం వెయ్యి దాటింది. ఆయా కుటుంబాలు శతాబ్ద కాలంగా ఇక్కడే నివాసిస్తున్నాయి. వీరంతా వ్యవసాయం, వ్యవసాయ కూలీపైనే ఆధారపడి జీవిస్తున్నారు. మండల కేంద్రానికి కేవలం 2.6 కిమీ దూరంలో ఉన్న లింగాపూర్‌కు కనీసం బీటీరోడ్డు కూడా లేదు. రోడ్డు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీంతో రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు.

బీటీ రోడ్డుకు నోచుకోక..

మండల కేంద్రం నుంచి దాదాపుగా అన్ని గ్రామాలకు బీటీరోడ్డు సౌకర్యం ఉంది. కానీ లింగాపూర్ మాత్రం బీటీ రోడ్డుకు నోచుకోవడం లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం లింగాపూర్ గ్రామానికి మాత్రం మొండిచేయి చూపింది. రాజకీయ కారణాల వల్లే సమస్య పరిష్కారానికి నోచుకోలేదని తెలుస్తోంది. సర్పంచ్ ఎన్నికల అనంతరం ప్రభుత్వం గ్రామ జ్యోతి కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ ఈ గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. అయినా.. ఎలాంటి అభివృద్ధి చేయలేదు. కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యార. ప్రస్తుతం యువకులంతా ఏకమై గ్రామాభివృద్ధి కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు.

రోడ్డు కష్టాలు వర్ణనాతీతం..

గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. కనీసం ఆటోలు కూడా నడవ లేని పరిస్థితి. ఇక అంబులెన్సు వారు సైతం పేషెంట్లను గుడిహత్నూర్ వరకు తీసుకురండి అక్కడి నుంచి తీసుకెళ్తాం అనే సమాధానం వినిపిస్తుంది. వర్షాకాలంలో ఈరోడ్డుపై ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. మొత్తం జారుడు బురదతో నిండి ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇకనైనా పాలకులు, అధికారులు స్పందించి గ్రామానికి బీటీరోడ్డు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎన్నాళ్లీ కష్టాలు..



తాతల కాలం నుంచి గ్రామానికి రోడ్డు లేదు. మేమే నడకతో జీవితం కానిచ్చాం. మా ముందు తరాలు కూడా మాలాగే కష్టాలు పడుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి చేస్తామంటున్నారు కానీ రోడ్డు వేయడం లేదు. ఇంకా ఎన్ని తరాలకో ఈ కష్టాలు.

– శ్రీరంగ్, లింగాపూర్

వాహనాలు పాడవుతున్నాయి



లింగాపూర్‌కు రాకపోకలు సాగించాలంటే గుంతల రోడ్డుపై ప్రయాణించాల్సి ఉంటుంది. దీంతో వాహనాలు త్వరగా పాడవుతున్నాయి. ప్రభుత్వాలు ఎన్ని మారినా.. రోడ్డు మాత్రం మారాలే. ఎమ్మెల్యే స్పందించి రోడ్డు మంజూరు చేయాలి.

– తబ్రేజ్ ఖాన్, లింగాపూర్.

విద్యార్థులకు అక్షరాభ్యాసం

ఉట్నూర్‌రూరల్: బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఘన్‌పూర్ పాఠశాలలో ఎంపీపీ జైవంత్‌రావు విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. ప్రభుత్వం పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. అదే విధంగా పల్లెప్రగతి దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్పంచ్ లత గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ కార్మికులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామపటేళ్లు, గ్రామస్తులు పాలొన్నారు.

ఒరిగిన విద్యుత్ స్తంభాలు..



జైనథ్ మండలంలోని కౌట, తాంసి మండలంలోని బండల్‌నాగాపూర్ గ్రామ శివారులో వ్యవసాయ సాగు కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు ఒకవైపు ఒరిగి ప్రమాదకరంగా మారాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి స్తంభాలను సరిచేయాలని కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

సెల్‌ఫోన్ అందజేత

ఇచ్చోడ: సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను ఇచ్చోడ పోలీసులు రికవరీ చేశారు. మండలంలోని మహ్మద్ జుబేర్, మనోజ్ కుమార్‌లు పది రోజుల క్రితం తమ సెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్నారు. వారి ఫిర్యాదు మేరకు వెబ్‌సైట్ ద్వారా గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ముదావత్ నైలు, ఎస్సై శ్రీకాంత్‌లు తెలిపారు. గురువారం బాధితులకు సెల్‌ఫోన్ అప్పగించారు.

రక్తదానం

ఎదులాపురం: రిమ్స్ రక్తనిధి కేంద్రంలో రక్త నిల్వల కొరత ఉండడంతో ఇండియన్ రెడ్‌క్రాస్ నేరడిగొండ మండల కోఆర్డినేటర్ కుంట కిరణ్ కుమార్‌రెడ్డి ద్వారా తెలుసుకున్న గ్రామీణ బ్యాంకు ఉద్యోగి కురిమిల్ల సాయిక్రిష్ణ గురువారం రక్తదానం చేశారు. రక్తం అత్యవసరంలో ఉన్న వారిని ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

పెన్నులు పంపిణీ

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు చిలుక సతీశ్ గురువారం విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. నోడల్ అధికారి పోశెట్టి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాకేశ్‌కుమార్, ఉపాధ్యాయులు సునీల్, నిఖిలేష్, సీతారాం పాల్గొన్నారు.

ఘనంగా 'పల్లెప్రగతి' సంబురాలు



బజార్‌హత్నూర్: కార్మికులను సన్మానిస్తున్న ఎంపీపీ

బజార్‌హత్నూర్: మండలంలోని 30 గ్రామ పంచాయతీలలో పల్లె ప్రగతి సంబురాలను ఘనంగా నిర్వహించారు. సర్పంచులు ఆయా గ్రామ పంచాయతీలలో జాతీయ జెండా ఆవిష్కరించారు. పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ అజాడే జయశ్రీ, జెడ్పీటీసీ మల్లేపూల నర్సయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

బేల: బీఆర్ఎస్ హయాంలోనే పల్లెల అభివృద్ధి చెందాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్ అన్నారు. గురువారం మండలంలోని గూడ గ్రామంలో నిర్వహించిన పల్లెప్రగతి దినోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఠాక్రే వనిత గంభీర్, ఎంపీడీవో మహేందర్‌కుమార్, సతీశ్ పవార్, ప్రమోద్‌రెడ్డి, తన్వీర్‌ఖాన్, గావుండే తాన్‌బా పాల్గొన్నారు.

బోథ్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం బోథ్ మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో పల్లెప్రగతి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పారిశుధ్య కార్మికులు, పాలకవర్గాలు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాతీయ జెండా ఆవిష్కరించారు. ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండల వ్యాప్తంగా పల్లెప్రగతి దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. 32 గ్రామపంచాయతీ కార్యాలయాల్లో సర్పంచులు జాతీయ జెండాలను ఆవిష్కరించి, పంచాయతీ కార్మికులను సత్కారించారు. కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: పల్లెప్రగతితోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో సంతోశ్‌కుమార్, సర్పంచ్ కోరెంగా గాంధారి, తహారే గణేశ్, ఈవో సంజీవ్‌రావు పాల్గొన్నారు.

నార్నూర్: నార్నూర్, గాదిగూడ మండలాల్లోని గ్రామాల్లో పల్లెప్రగతి దినోత్సవం నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాయాల్లో సర్పంచ్‌లు జాతీయ జెండాను ఆవిష్కరించారు. పారిశుధ్య కార్మికులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచులు బానోత్ గజానంద్‌నాయక్, పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్, యునుస్ అక్బానీ, నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్, జాదవ్ శ్రీరాంనాయక్, కాంతరావు దుర్గే పాల్గొన్నారు.



ఇంద్రవెల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



బేల: సన్మానిస్తున్న రావుత్ మనోహర్



ఇచ్చోడ: ముఖరా(కె)లో ర్యాలీ తీస్తున్న సర్పంచ్

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి



తనిఖీలు చేస్తున్న అధికారులు

నేరడిగొండ: ఫర్టిలైజర్ డీలర్లు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని బోథ్ వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీధర్ స్వామి అన్నారు. గురువారం మండలంలోని వాంకిడి, బంధం రెగడి గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని రకాల విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బిర్రు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. కర్రలే ఆధారం..



తాంసి: పంట చేలలో పలుచోట్ల విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. తాంసి గ్రామ శివారులో వేలాడుతున్న విద్యుత్ తీగలకు రైతులు కర్రలు ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ తీగలను సరి చేయాలని రైతులు కోరుతున్నారు.

– సంబంధిత అధికారి: మనోజ్‌కుమార్ విద్యుత్‌శాఖ, ఏఈ, ఫోన్: 94408 11696

పట్టణ అభివృద్ధే లక్ష్యం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణ అభివృద్ధే లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. గురువారం భుక్తాపూర్ కాలనీలో రూ. 48 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్డు, డ్రైయినేజీ నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. వార్డు కౌన్సిలర్ బండారి సతీశ్, కాలనీవాసులతో కలిసి ప్రత్యేక పూజలు చేసి, పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చిన తొమ్మిదేళ్ల కాలంలో భుక్తాపూర్‌కాలనీలో రూ.9 కోట్ల వ్యయంతో పనులు చేపట్టామన్నారు. కాలనీలో జరిగిన అభివృద్ధి కాంగ్రెస్ నాయకులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శైలజ, నాయకులు మసూద్ పటేల్, షాహిద్ పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్ ద్వారా సరిఫికెట్లు జారీ



దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్, సిబ్బంది

ఇచ్చోడ: స్పెషల్ డ్రైవ్ ద్వారా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నట్లు తహసీల్దార్ మోహన్ సింగ్ తెలిపారు. కులవృత్తుల వారికి రూ. లక్ష రుణం ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో వారం రోజుల నుంచి ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం వందలాది మంది కార్యాలయానికి వస్తున్నట్లు తెలిపారు. దీంతో గురువారం సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. దరఖాస్తులలను వెంటనే పరిశీలించి, పత్రాలను జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఎవరూ ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. ఆర్ఐ హుస్సేన్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో గ్రామాలు

- బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు



అవార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే బాపురావు

తలమడుగు: గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. గురువారం దశాబ్ది ఉత్సవాలలో భాగంగా పల్లెప్రగతి దినోత్సవం నిర్వహించారు. జాతీయ జెండా ఆవిష్కరించారు. గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయన్నారు. అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటమ్మ, మొట్టే కిరణ్ కుమార్, మండల కన్వీనర్ వెంకటేశ్, వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మగ్గిడి ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఖానాపూర్: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవడం ద్వారానే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని ఖానాపూర్ కోర్టు జడ్జి జితిన్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని కొత్తపేట్‌లో ప్రజలతో నిర్వహించిన న్యాయసేవలపై అవగాహన సదస్సులో మాట్లాడారు. నిరుపేదలకు న్యాయసేవాసంస్థ ఆధ్వర్యంలో ఉచిత సేవలు అందిస్తామన్నారు. గ్రామాల్లో వంద శాతం అక్షరాస్యత ఉండేలా దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కాసవేని సునీత, ఎస్సై ఆర్.శంకర్, న్యాయవాదులు సురేష్, వెంకట్, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.